సాక్షి
బాపట్ల

మంగళవారం । 9 । సెప్టెంబర్ । 2025



భక్తిగా చండీ హోమం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో సోమవారం చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,16,034 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 88,979 క్యూసెక్కులు వదులుతున్నారు.



దుర్గగుడిలో ప్రత్యేక పూజలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): చంద్రగ్రహణం అనంతరం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయాన్ని అర్చకులుసోమవారం పవిత్ర కృష్ణా జలాలతో శుద్ధిచేశారు.

రైతుకు యూరియా కష్టాలు

ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నేడు 'అన్నదాత పోరు'

భూమినే నమ్ముకున్న రైతులు లాభం లేకున్నా అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక యూరియా కష్టాలు మొదలయ్యాయి. యూరియా లేక పంటలు కళ్ల ఎదుటే ఎండిపోతుంటే మిన్నకుండిపోవాల్సిన పరిస్థితి. కూటమి నేతలు మాత్రం యూరియాను బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుని జేబులు నింపుకుంటున్నారు. ఈనేపథ్యంలో వైఎస్సార్ సీపీ రైతులకు అండగా బ్లాక్ మార్కెట్‌పై పోరుకు సిద్ధమైంది. మంగళవారం జిల్లాలోని అన్ని ఆర్డీఓ కార్యాలయాల ఎదుట నిరసన తెలియజేయనున్నారు.

- జిల్లాకు 25వేల టన్నుల యూరియా డిమాండ్
- ఇప్పటివరకు పంపిణీ చేసింది 19,630 టన్నులు
- కాకి లెక్కలు చెబుతున్న ప్రభుత్వం
- యూరియా కోసం పడిగాపులు పడుతున్న రైతులు
- ఆర్డీవో కార్యాలయాల వద్ద నిరసన



కొల్లూరు మండలం గాజుల్లంకలో యూరియా కోసం తరలివచ్చిన రైతులు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, బాపట్ల: పిట్టలవానిపాలెం మండలం పిట్టలవానిపాలెం, ఖాజీపాలెం, చందోలు, గవినివారిపాలేనికి ఇప్పటికి రెండు సార్లు యూరియా ఇచ్చారు. భవనంవారిపాలెం తోపాటు చుట్టుపక్కల గ్రామాలకు మాత్రం ఒక్కసారి కూడా యూరియా సరఫరా చేయలేదు. బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ సమీప బంధువులు ఉన్న గ్రామాలకు యూరియా ఇచ్చి వైఎస్సార్ సీపీ మద్దతుదారులున్న గ్రామాలకు యూరియా ఇవ్వలేదన్న ఆరోపణలున్నాయి. బాపట్ల మండలం మరుప్రోలువారిపాలెంకు ఆదివారం 200 కట్టల యూరియా రాగా 400 మంది రైతులు వచ్చారు. వచ్చిన యూరియా ఏ రైతుకు ఇవ్వాలి? క్యూలైన్లలో తోపులాట జరిగింది. చాలా చోట్ల ఇదే పరిస్థితి. ప్రభుత్వం తగినంత యూరియా అందజేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన పంట పోతుందని ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎన్నడూ లేని ఈ పరిస్థితి కల్పించిన కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

3.74లక్షల ఎకరాలు సాగు

జిల్లాలో సాధారణ విస్తీర్ణం 3.74 లక్షల ఎకరాలు. ఇప్పటికే బాపట్ల, రేపల్లె, వేమూరు ప్రాంతాల్లో 2.50 లక్షల ఎకరాలలో వరిపంట సాగుచేశారు. ఇప్పటికే రెండు నుంచి మూడు దఫాలు యూరియా వేయాల్సి వుంది. కనీసం రెండు దఫాలు అనుకున్నా ఎకరాకు రెండు బస్తాల చొప్పున 2.50 లక్షల ఎకరాలకు 25 వేల టన్నుల యూరియా అవసరం. కొంత మంది మూడో సారి వేయాలనుకొంటే మరో 12,500 టన్నుల యూరియా కావాలి. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో ఏప్రిల్, మే, జూన్, జులై, ఆగస్టు నెలల్లో 19,630 టన్నుల యూరియా పంపిణీ చేశామంటున్నారు. మరో 3,588 టన్నుల యూరియా అందుబాటులో ఉందంటున్నారు. యూరియాలో చాలా వరకు రైతులకు కాకుండా పచ్చనేతలు, కొందరు ఫెర్టిలైజర్ వ్యాపారులకు చేరినట్లు ఆరోపణలున్నాయి.

రైతులు, పార్టీ శ్రేణులు కదలిరావాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున పిలుపు



ప్రభుత్వం రైతులకు తగినంతగా యూరియా అందించక ఇబ్బందులు పెడుతోందని బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మేరుగ నాగార్జున ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ యూరియా అందక వరి సాగు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏనాడూ రైతులకు ఎరువుల కొరత లేదన్నారు. ఆర్బీకేల ద్వారా తగినంతగా ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. ఈ ప్రభుత్వం యూరియా అందించలేక చతికిల పడిందని విమర్శించారు. రైతులకు మద్దతుగా రైతు పోరు పేరిట వైఎస్సార్‌సీపీ మంగళవారం ఆందోళనకు పిలుపునిచ్చిందన్నారు. పార్టీ శ్రేణులతోపాటు రైతులందరూ ఈ ఆందోళనల్లో పాల్గొని ప్రభుత్వానికి నిరసన తెలపాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి యూరియా అందించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని మేరుగ నాగార్జున డిమాండ్ చేశారు.



నేడు అన్నదాత పోరు

అన్నదాతల యూరియా కష్టాలపై వైఎస్సార్ సీపీ మంగళవారం జిల్లాలోని అన్ని ఆర్డీవో కార్యాలయాల వద్ద నిరసన చేపట్టింది. ఈ ఆందోళన ద్వారా సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకరానుంది. కార్యక్రమంలో పార్టీ శ్రేణులతోపాటు పెద్దఎత్తున రైతులు పాల్గొననున్నారు. రేపల్లె ఆర్డీవో కార్యాలయం వద్ద వేమూరు, రేపల్లె నియోజకవర్గాల రైతులు ఆందోళనలో పాల్గొననుండగా బాపట్లలో బాపట్ల నియోజకవర్గం, చీరాలలో అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాల ఆందోళన జరగనుంది. రైతులకు మద్దతుగా జరగనున్న ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు పిలుపునిచ్చాయి.

సర్కారు నిర్బంధం

ఒకపక్క యూరియా లేక రైతులు ఆందోళన చెందుతుంటే ఏ ఒక్క రైతు యూరియా కోసం రోడ్డు ఎక్కకుండా చూడాలని ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి పెంచింది. సర్కారు తీరుతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. తగినంత యూరియా అందించకుండా రైతులు రోడ్డెక్కకుండా చూడాలంటే ఎలా అని అంటున్నారు. ఇప్పటికైనా ఆంక్షలు, నిర్బంధాలు మాని తగినంత యూరియా సరఫరా చేయాలని అధికారులు కోరుతున్నారు.

బీచ్ ఫెస్టివల్‌ను రాష్ట్ర పండుగగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: బీచ్ ఫెస్టివల్‌ను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. బీచ్ ఫెస్టివల్ నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ చెప్పారు. ఈనెల 26, 27, 28 తేదీలలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించే బీచ్ ఫెస్టివల్‌కు భద్రత ఏర్పాట్ల నిమిత్తం నాలుగు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు నియమించాలని చెప్పారు. ఒక రోజుకి కనీసం 80 వేల నుంచి లక్షమంది వరకు పర్యాటకులు వచ్చే అవకాశం ఉన్నందున, పర్యాటకుల సంఖ్యకు తగినట్టుగా సరిపడా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజలు అత్యంత ఆహ్లాదం, సరదాగా, సంతోషంతో గడిపే వాతావరణం కల్పిస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం గాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీసులతోపాటు మెరైన్ పోలీసులు అందుబాటులో ఉంటారని చెప్పారు. బీచ్ ఫెస్టివల్‌కు వచ్చే ప్రజలు అధైర్య పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సూర్యలంక బీచ్‌ను విద్యుత్ వెలుగులతో నింపాలన్నారు. పర్యాటకుల కోసం 200 డ్రెస్ చేంజింగ్ రూమ్స్, 350 మరుగుదొడ్లు, షవర్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించిన నేపథ్యంలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. పారిశుధ్య కార్యక్రమాలు భారీగా చేపట్టాలని కలెక్టర్ చెప్పారు. పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేసేలా అవగాహన కల్పించాలన్నారు. కాల్ సెంటర్, పోలీస్ పెట్రోలింగ్ ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, ఎస్పీ తుషార్‌డూడీ, వేదుకల నోడల్ ఆఫీసర్ గా పర్యాటక శాఖ అధికారి నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలి

ఇన్‌చార్జి జేసీ గంగాధర్‌గౌడ్



బాపట్ల: జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు. హెచ్ఐవీ రిస్క్ మినిట్స్ క్యూఆర్ కోడ్ స్టిక్కర్ సోమవారం ఆవిష్కరించారు. ఇన్‌చార్జి జేసీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎయిడ్స్ నియంత్రణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని స్కూల్స్, కళాశాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ మాట్లాడుతూ జిల్లాలో రెండు నెలల పాటు (ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12వ తేదీ వరకు) ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంపై ముమ్మరంగా ప్రచారం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో టీబీ అధికారి డాక్టర్ మహమ్మద్ సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా అక్షరాస్యత ఎంతో ముఖ్యం

నోడల్ అధికారి బోయిడి మధుసూదనరావు



బాపట్ల అర్బన్: మహిళా అక్షరాస్యత ఎంతో ముఖ్యమని వయోజన విద్యాశాఖ బాపట్ల జిల్లా నోడల్ అధికారి బోయిడి మధుసూదనరావు పేర్కొన్నారు. 59వ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం బాపట్లలోని మహిళా సమైఖ్య భవనంలో సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్షరాస్యతా దినోత్సవం స్ఫూర్తితో మహిళలకు అక్షరాస్యత పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. బాపట్ల మహిళా సమైక్య ఏపీఎం సురేష్ మాట్లాడుతూ బాపట్ల మండలం పరిధిలో జరిగే అక్షరాస్యతా కార్యక్రమం విజయవంతంగా జరగడానికి మహిళలకు అవగాహన కల్పించి చదువుకునేందుకు ముందుకు వచ్చేలా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వయోజన విద్యా శాఖ పర్యవేక్షకులు ఓ.బాదుల్లా, ప్రసాద్, శ్రీ శివరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

11న డిప్యూటీ సీఎం పర్యటన

ముత్తాయపాలెం రిజర్వు ఫారెస్ట్‌లో మడమొక్కలు నాటనున్న పవన్‌కల్యాణ్

సాక్షి ప్రతినిధి,బాపట్ల: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జిల్లా పర్యటన ఖరారైనట్లు అధికారులు తెలిపారు. ఈనెల 11వ తేదీ గురువారం డిప్యూటీ సీఎం జిల్లాకు రానున్నారు. బాపట్ల మండలం ముత్తాయపాలెం సమీపంలోని పేర్లి కెనాల్ బ్రిడ్జి వద్ద రిజర్వు ఫారెస్ట్‌లో మడ మొక్కలు నాటనున్నారు. బ్రిడ్జి వద్ద నుంచి 3.7 కిలోమీటర్ల మేర ఇరువైపుల మడ అడవులను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ ప్రాంతంలో 35 వేల మొక్కలను నాటనున్నారు.

అధునాతన రైస్ కార్డులు అందరికి అందించాలి

ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్



బాపట్ల: జిల్లాలో లబ్ధిదారులందరికీ అధునాతన రైస్ కార్డులు అందజేయాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి గంగాధర్‌గౌడ్ పౌర సరఫరాల అధికారులకు తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో ఇన్‌చార్జి జేసీ జి గంగాధర్‌గౌడ్ ఈ పాస్ మిషన్‌ను రైస్ డీలర్‌కు అందజేశారు. ఇన్‌చార్జి జేసీ మాట్లాడుతూ జిల్లాలోని 4 లక్షల 71 వేల 3 వందల 82 మంది లబ్ధిదారులకు అధునాతన రైస్ కార్డులు అందజేసేందుకు 1123 ఈ పాస్ మిషన్లు సరఫరా చేయబడ్డాయని తెలిపారు. ఈపాస్ మిషన్ల ద్వారా ఈనెల 15వ తేదీ నుంచి అధునాతన రైస్ కార్డులను సిబ్బంది లబ్ధిదారుని ఇంటికి వెళ్లి ఈ కేవైసీ అనంతరం అందజేస్తారని తెలిపారు. అధునాతన రైస్ కార్డులు అందజేయడంలో ప్రజాప్రతినిధుల సహకారం పొందాలని ఆయన పౌర సరఫరా అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి జమీర్ తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపుల నుంచి రక్షించండి !

- విలేకరి ముసుగులో భర్త ఆగడాలు
- జిల్లా పోలీస్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు



చిన్న కుమార్తె లావణ్యతో బాధితురాలు నాగేశ్వరి

గుంటూరు: వారసత్వంగా రానున్న పొలం కాగితాలు రాయించుకుని తేవాలంటూ భర్త, బావ అయిన ఈనాడు విలేకరి (గుంటూరు జిల్లా ప్రత్తిపాడు)తో పాటు అత్త, మామల నుంచి రక్షణ కల్పించాలని ఓ మహిళ, తన కుమార్తెతో కలసి ప్రాధేయపడింది. నాలుగు రోజులుగా కనిపించకుండా బంధువుల ఇళ్లల్లో ఉంటున్నట్లు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జరిగిన ప్రజా ఫిర్యాదులు–పరిష్కార వేదికలో మొరపెట్టుకుంది. అనంతరం బాధితురాలైన కల్లూరి నాగేశ్వరి మీడియాతో మాట్లాడారు. 2009లో ప్రత్తిపాడుకి చెందిన కల్లూరి గురునాథంతో పెళ్లి అయ్యింది. ఇద్దరు ఆడ పిల్లలు. పెద్దమ్మాయి ఇంటర్, రెండో కుమార్తె ఏడో తరగతి చదువుతోంది. భర్త, నేను పొలం పనులకు వెళ్తాం. భర్తకు మద్యం అలవాటు ఉంది. నాగేశ్వరి అమ్మమ్మ చెవినేని ఈశ్వరమ్మ నుంచి తల్లి ఆదిలక్ష్మి వాటా కింద రావాల్సిన 70 సెంట్ల పొలం ప్రత్తిపాడులో ఉంది. ప్రస్తుతం దాని ధర రూ.20 లక్షలు ఉంది. అమ్మమ్మ ఈశ్వరమ్మ వద్దకెళ్లి 70 సెంట్ల పొలం రాయించుకుని కాగితాలు తేవాలంటూ భర్త, బావ అయిన ఈనాడు ప్రత్తిపాడు విలేకరి సురేష్, అత్త,మామలు బెదిరిస్తున్నారు. అమ్మమ్మ నుంచి కాగితాలు తీసుకురాకపోతే చంపుతామంటూ చితకబాదడం, గదిలో నిర్బంధిస్తున్నారు. ఈనెల ఐదున నన్ను కొట్టి, తెల్ల కాగితాలు, రూ.50 స్టాంప్ కాగితాలపై సంతకాలు పెట్టించాలని ప్రయత్నించగా అందుకు నిరాకరించాను. గతంలో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా, అతని పలుకబడితో కేసు నమోదు చేయలేదు. అదిగాక ఎమ్మెల్యే రామాంజనేయులు, రాజకీయ నాయకులు, పోలీసులు తెలుసంటూ బెదిరిస్తున్నారు.

బకాయిల విడుదలకు ఏపీటీఎఫ్ 'నిరసన వారం'



మాట్లాడుతున్న బసవ లింగారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ చేపట్టిన 'నిరసన వారం' ఉద్యమ కార్యాచరణ విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు పిలుపునిచ్చారు. జిల్లా కోర్టు ఎదుట ఉన్న సంఘ జిల్లా శాఖ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు 15నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పటం లేదని, 30శాతం ఐఆర్‌పై కప్పదాటు వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. సరెండర్ లీవ్ బకాయిలను చెల్లించకపోవడంతో ఉపాధ్యాయుల్లో ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతోందని తెలిపారు. అనవసరమైన యాప్స్ రద్దు చేయక పోగా పనిభారం పెంచే అస్సెస్మెంట్ బుక్లెట్స్ పెట్టడం పుండు మీద కారం చల్లినట్లు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని మొర పెట్టుకునేందుకు విద్యాశాఖా మంత్రి అందుబాటులో లేకపోవడం అత్యంత బాధాకరమని తెలిపారు. 15 నెలలు వేచి చూశామని, అన్ని బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వారం రోజులు రోజుకొక ఉద్యమ కార్యాచరణ నిరసన వారం చేపట్టామని తెలిపారు. ప్రభుత్వం దిగిరాని పక్షంలో పెద్దఎత్తున ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, ఉపాధ్యక్షులు పి.నాగశివన్నారాయణ, పి.లక్ష్మీనారాయణ, సత్యనారాయణమూర్తి, జి.దాస్, ముని నాయక్, షుకూర్, గురుమూర్తి, కృష్ణారావు, సుబ్బారావు, రాజ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై బాధ్యత వహించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పాల్గొన్నారు. ప్రజా సమస్యల వినతి పత్రాలను కలెక్టర్ స్వయంగా స్వీకరించి, కొన్నింటికి తక్షణమే పరిష్కార మార్గం చూపారు. కొన్నింటిని సంబంధిత శాఖ అధికారులకు అందించి ప్రతి వినతిని నాణ్యతతో తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు పలు సూచనలు చేశారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యత చూపని అధికారులపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల సమస్యలను పరిష్కరించిన వాటికి ఆడిటింగ్ పూర్తి చేయాలని సూచించారు. ఆడిటింగ్ చేయుటలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వార్తాపత్రికలలో ప్రచురితమైన ప్రతికూల వార్తలపై జిల్లా కలెక్టర్ స్పందించి ఆయా శాఖలకు సంబంధించిన అధికారులను ప్రశ్నించారు. అధికారులు ఆయా వార్తలపై జిల్లా వివరణ ఇచ్చారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో భూములు, పొలాలు, ఇండ్ల స్థలాల రీ సర్వే జరుగుతుందని, స్వామిత్వ సర్వే కూడా జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అందరూ ఈ సర్వేలో సహకరించి వారి ఆస్తులను కొలతలు వేయించుకొని ప్రాపర్టీ కార్డులు పొందాలని అన్నారు. ఎవరి ఆస్తులను వారే పరిరక్షించుకోవాలని ఆయన తెలిపారు.

ఆత్మహత్యల నివారణ దినోత్సవంపై అవగాహన కల్పించాలి

ఈనెల 10వ తేదీన ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఆత్మహత్యలు ఎక్కువైనాయని, 15 నుంచి 30 సంవత్సరాలలోపు వారు ఎక్కువగా ఆత్మహత్యలకు గురవుతున్నారని, ఈ ఆత్మహత్యల నుంచి ప్రజలను కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు

వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ గుంటూరు జిల్లా అధ్యక్షులు సైదాఖాన్



కలెక్టరేట్ ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ నాయకులు

గుంటూరువెస్ట్: ఎన్నికల సమయంలో మైనార్టీలకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత దాదారుణంగా మోసం చేసిన కూటమి ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకుంటుందని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు పఠాన్ సైదాఖాన్ తెలిపారు. పార్టీ పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇమామ్‌లు, మౌజన్‌లకు ప్రతినెలా క్రమంతప్పకుండా రూ.5000, రూ.10 వేలు చెల్లించారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా మరచిపోయిందని పేర్కొన్నారు. దీంతోపాటు మసీదుల మరమ్మతులకు ఇస్తామన్న రూ.లక్ష కూడా ఇవ్వలేదని తెలిపారు. నెల వారీ వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయని ఆయన ప్రశ్నించారు.

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ గులామ్ రసూల్ మాట్లాడుతూ ఇటీవల పండుగ సందర్భంగా మైనార్టీ విద్యార్థులకు బుర్ఖాలు వేసి నృత్యాలు చేయించిన భాష్యం స్కూల్ అధినేత భాష్యం రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నూరి ఫాతిమా మాట్లాడుతూ మైనార్టీల ఓట్లతో గద్దెనెక్కిన తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు మొహమ్మద్ నసీర్ అహ్మద్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లు మైనార్టీలకు జరుగుతున్న అన్యాయాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డ్ బిల్లు అంశంలోనూ నసీర్ మైనారిటీల మనోభావాలను అస్సలు గుర్తించలేదన్నారు. తూర్పు నియోజకర్గ పరిధిలో ముస్లింలు తోపుడు బండ్లపై జీవనం పొందుతుంటే వారిని కూడా తొలగించేందుకు నసీర్ సహకరించారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం చావుదెబ్బ తింటుందని నూరి ఫాతిమా పేర్కొన్నారు.

అనంతరం గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ విభాగం అధికార ప్రతినిధి సయ్యద్ అబీబుల్లా, సంయుక్త కార్యదర్శి అఫ్సర్, జిల్లా కార్యదర్శి రజియా బేగం, నియోజక వర్గాల అధ్యక్షులు లియాఖత్, ఖాసిం, నూరుల్లా, రబ్బాని, మహబూబ్ బాషా, జాని బాషా, కార్పొరేటర్లు అబీద్, ఫర్జానా, మైనారిటీ విభాగాల మండల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,000 గరిష్ఠం : రూ. 3,200

మోడల్ ధర రూ. 2,800

పసుపు ధరలు

(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 799

కొమ్ములు : 537బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,750	10,531	10,150

కాయలు : 242 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,750	10,550	10,450

మొత్తం అమ్మకాలు : 584.25 క్వింటాళ్లు

-దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం

(సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	53,255
అమ్మకాలు	52,437
నిల్వ	16,613

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-14,300
నంబరు-5	10,000-13,500
341	11,000-13,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-14,600
నంబరు-5	10,000-13,600
341	11,000-15,500
4884	10,000-13,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 15,400
బాడిగ 355	10,000 - 15,500
దేవనూరు డీలక్స్	10,000 - 13,800
ఆర్మూర్	9,800 - 12,500
తాలుకాయలు	6,200 - 7,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 15,300
బాడిగ 355	10,000 - 15,000
దువనూర్ డీలక్స్	10,500 - 13,500
తాలు	5,500 - 7,500

-కొరిటెపాడు (గుంటూరు)

మానవత్వం చెత్తలో కలిసిన వేళ

- వెలుగులోకి వచ్చిన బాపట్ల పురపాలక సంఘం దాష్టీకం
- అనాథ మృతదేహానికి దహన సంస్కారాలు జరిపేందుకు చెత్త ట్రాక్టర్లో తీసుకు వెళ్లేందుకు యత్నం



చెత్తట్రాక్టర్లు తీసుకుపోయేందుకు సిద్ధంగా ఉంచిన ట్రాక్టర్



అంబులెన్సులోకి ఎక్కిస్తున్న పారిశుధ్య సిబ్బంది

బాపట్ల అర్బన్: ఎక్కడ పుట్టాడో తెలియదు ఎక్కడ పెరిగాడో తెలియదు. నా అన్న వాళ్లు ఎవరో తెలియదు. రైలు రూపంలో దూసుకొచ్చిన మృత్యువుకు బలయ్యాడు. రైలు పట్టాలపై మృత్యువాతపడిన అనాథ శవాల జాబితాలో తాను ఒక అంకెగా మారాడు. అలాంటి అనాథ మృతదేహానికి మానవత్వం అనే దహన సంస్కారం చేయాల్సిన మున్సిపల్ అధికారులు.. అమానవీయంగా వ్యవహరించారు. చాపలో చుట్టిన శరీరాన్ని చెత్తకుప్పగా మార్చాలని చూశారు. అనాథ మృతదేహానికి ఇదేనా అంతిమ సంస్కారం అని ప్రశ్నిస్తే నీళ్లు నమిలారు. బాపట్ల రైల్వేస్టేషన్లో ఈనెల 3వ తేదీన అనాథ మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. ఎవరు రాకపోవడంతో స్థానిక ఏరియా వైద్యశాలకు తరలించారు. ఇప్పటివరకు ఎదురుచూసినా మృతదేహానికి సంబంధించిన బంధువులు ఎవరు రాకపోవడంతో సోమవారం అంతిమ సంస్కారాలకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో పోస్టుమార్టం పూర్తయ్యాక ఏరియా ఆసుపత్రి వైద్యులు మున్సిపల్ సిబ్బందికి మృతదేహాన్ని అప్పగించారు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు స్థానిక మునిసిపల్ సిబ్బంది చెత్తను తరలించే వాహనంలో ఎక్కించబోయారు. ఆ సమయంలో సాక్షి రిపోర్టర్ ఫొటోలు తీసేందుకు ప్రయత్నించగా వెంటనే అంబులెన్స్ పిలిపించారు. ఈ ఘటనపై మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నించగా మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించే బాధ్యత ప్రభుత్వాసుపత్రిదేనని పేర్కొన్నారు. ప్రభుత్వాసుపత్రి వారిని ప్రశ్నించగా తాము పోస్టుమార్టం చేయడం వరకేనని మునిసిపల్ సిబ్బంది శ్మశానవాటికకు తీసుకెళతారని తెలియజేశారు. అనాథ మృతదేహానికి అంతిమయాత్ర నిర్వహించాల్సిన అధికారులే ఒకరిపై ఒకరు చెప్పుకోవడం చెత్త ట్రాక్టర్లో తరలించేందుకు ప్రయత్నించడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అర్జీలు పునరావృతం కాకుండా చూడాలి

ఎస్పీ తుషార్‌డూడీ



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్లటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 52 మంది అర్జీదారులు ఎస్పీ కార్యాలయానికి చేరుకొని తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. బాధితుల సమస్యలు తెలుసుకున్న ఎస్పీ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లాలోని పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. వివిధ సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా పోలీస్ శాఖ ఉండాలన్నారు. అర్జీలను పూర్తిస్థాయిలో విచారించి శాశ్వతంగా పరిష్కారం చూపాలన్నారు. పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో అధికంగా కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీ మోసాలకు సంబంధించిన అర్జీలే అధికంగా వస్తున్నాయని పోలీసు అధికారులు ఎస్పీకి వివరించారు. కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, చీరాల డీఎస్పీ మొయిన్, పీజీఆర్‌ఎస్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జె.పంగులూరు విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: జాతీయ స్పోర్ట్స్‌డే సందర్భంగా తిరుపతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జె.పంగులూరు విద్యార్థులకు బంగారు పతకాలు రావటం అభినందనీయమని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. క్రీడాకారులను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో అభినందించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జె.పంగులూరుకు చెందిన సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో ఖోఖోతోపాటు పలు క్రీడాల్లో విద్యార్థులకు బంగారు పతకాలు కైవసం చేసుకోవటం హర్షనీయమన్నారు. విద్యార్థులు మరెన్నో పతకాలు సాధించాలని సూచించారు. ఖోఖోలో గోల్డ్ మెడల్, మరో విభాగం వెయిట్ లిఫ్టింగ్ పురుషుల భాగంలో గోల్డ్, సిల్వర్ కైవసం చేసుకున్నారు. అథ్లెటిక్స్ లాంగ్ జంప్‌లో రెండో స్థానం సిల్వర్ మెడల్ కై వసం చేసుకున్నారు. జోనల్ విభాగంలో బాక్సింగ్ విభాగంలో మూడు గోల్డ్, బాలుర విభాగంలో ఒక గోల్డ్ సాధించి బాపట్ల జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనపరిచారు.

రేపు నాయుడమ్మ స్మారక అవార్డు ప్రదానోత్సవం



తెనాలి: ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ స్మారక అవార్డు ప్రదానోత్సం ఈనెల 10న ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరగనుంది. తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఆరోజు సాయంత్రం 4.30 గంటలకు ఏర్పాటయ్యే ప్రత్యేక సభకు సంస్థ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు అధ్యక్షత వహిస్తారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఫైనాన్సియల్ సర్వీసెస్ విభాగ కార్యదర్శి నాగరాజు మద్దిరాలకు నాయుడమ్మ అవార్డును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రదానం చేయనున్నారు. కార్యక్రమంలో చెన్నైలోని సీఎల్ఆర్ఐ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ స్వర్ణ వి.కాంత్, పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం పాల్గొంటారు.

తెనాలి ముద్దుబిడ్డ

తెనాలికి చెందిన విలక్షణ మహనీయుల్లో ప్రఖ్యాత శాస్త్రవేత్త యలవర్తి నాయుడమ్మ ఒకరు. విదేశాల్లో ఉన్నతవిద్య చదువుకుని, అక్కడే ఉద్యోగావకాశం లభించినా, కాదనుకుని మాతృదేశం వచ్చారు. చెన్నైలోని కేంద్ర చర్మ పరిశోధన సంస్థ (సీఎల్ఆర్ఐ)లో శాస్త్రవేత్తగా చేరారు. తన కృషితో డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. తోలు పరిశ్రమ రంగంలో సాధించిన విజయాలతో 48 జాతీయ పరిశోధనాశాలలు, 30 వేల శాస్త్రవేత్తలు కలిగిన సీఎస్ఐఆర్‌కు డైరెక్టర్ జనరల్‌గా చేశారు. శాస్త్ర విజ్ఞాన అధ్యయనాలు, పరిశోధనలపై ఎంతో నిబద్ధత కలిగిన డాక్టర్ నాయుడమ్మ, దేశమంతా శాస్త్రీయ అభినివేశం లోతుగా విస్తరించాలని తపించారు. హేతుబద్ధ చింతన, శాస్త్రీయ వివేచనా, నిరంతరం అధ్యయనం, నిత్య పరిశోధన ఆయన జీవ ధాతువులు. సామాజిక విషయాల్లోనూ శాస్త్రీయ అభినివేశాన్ని ప్రదర్శించటం నాయుడమ్మ ఆశయం. మూఢ విశ్వాసాల్నీ ముహూర్త బలాల్నీ వీడి, మనిషి చైతన్యం, వ్యక్తిత్వం వికసించే మానవీయ సమత వైపు అడుగిడటం ఆయన కల్పించే నిజమైన నివాళి. అలాగే ఆయన పేరిట అవార్డులకూ శాస్త్రవేత్తలనే ఎంపిక చేస్తే సబబుగా ఉంటుంది.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య



చీరాల అర్బన్: ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం చీరాల మండలం ఈపూరుపాలెం ఇందిరానగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇందిరానగర్‌కు చెందిన శ్రీకౌసల్య (23) రెండేళ్లుగా పుట్టింటిలోనే ఉంటోంది. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటి వెనుక కాలువలోని చిల్లచెట్లకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతురాలి సోదరుడు పల్లా లోకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఈపూరుపాలెం ఎస్సై ఎ.చంద్రశేఖర్ తెలిపారు.

వృద్ధ మహిళను ఇంటి నుంచి గెంటేశారు



నగరంపాలెం: ఇంట్లోంచి బయటకు పంపించడంతో ఓ వృద్ధురాలు ఆరుబయట చీకట్లోనే ఉండిపోయింది. ఆర్టీసీ కాలనీ వెంకట్రావుపేట రెండో వీధిలోని ఓ ఇంట్లో 62 ఏళ్ల సంగీత సుధ ఉంటోంది. పైన ఆమెకు తెలిసిన కుటుంబ సభ్యులు ఉంటున్నారు. సోమవారం రాత్రి ఆస్తి విషయంపై సుధతో వారు గొడవకు దిగారు. ఇంట్లోంచి బలవంతంగా ఆమెను బయటకు పంపేశారు. లోపలకు రాకుండా గేటుకు లోపల తాళాలు వేశారు. దీంతో చేసేది లేక సుధ ఇంటి ఎదుట ఓ కుర్చీలో కూర్చుండిపోయింది. ఇంటి ఆస్తికి సంబంధించి గొడవ కోర్టులో ఉందని, ఆస్తితో సంబంధం లేని వారు ఇంట్లోంచి వెళ్లిపోవాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆమె వాపోయింది. స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయినట్లు తెలిపింది.

కొత్తరెడ్డిపాలెంలో విష జ్వరాలు

ఇద్దరి మృతి

చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో పది రోజుల్లో ఇద్దరు విష జ్వరాలతో మరణించటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని రామాలయం సెంటర్ పరిధిలో కొద్ది రోజుల కిందట బడే రాము అనే వ్యక్తి విష జ్వరంతో గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు వెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ కిడ్నీ, ఇతర సమస్యలతో మృతి చెందాడు. ఇదే ప్రాంతంలో గత నెలలో మరో వ్యక్తి జ్వరం బారిన పడి మృతి చెందటంతో స్థానికంగా ఆందోళన వ్యక్తం అవుతోంది. వీరిలో ఒకరికి గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో మృతి చెందుతున్న వారి లక్షణాలు ఉన్నట్లు ప్రైవేటు వైద్యులు నివేదిక ఇచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. కొత్తరెడ్డిపాలెం సమీప ప్రాంతాల్లో జ్వర పీడితులు సంఖ్య అధికంగా ఉండటంతో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. మంగళవారం గ్రామంలో రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యులు తెలిపారు. ప్రత్యేక బృందాల ద్వారా సేవలు అందించనున్నట్లు చెప్పారు.

కృష్ణా నదిలో దూకి యువకుడు గల్లంతు



తోడేటి హర్షవర్ధన్ (ఫైల్)



కృష్ణా నదిలో గల్లంతైన యువకుడి కోసం గాలిస్తున్న ఫైర్ సిబ్బంది

కొల్లూరు: కృష్ణా నదిలో దూకి ఓ యువకుడు గల్లంతైన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, రెవెన్యూ అధికారులు తెలిపిన ప్రాథమిక సమాచారం మేరకు.. మండలంలోని చింతర్లంకకు చెందిన తోడేటి హర్షవర్ధన్(22) తోటి మిత్రులతో కలసి రాత్రి సమయంలో మండలంలోని పెసర్లంక -పెదలంక అరవింద వారధి పైకి వచ్చాడు. కొంత సమయం గడిచిన అనంతరం ఓ మిత్రుడు ద్విచక్ర వాహనంపై కొల్లూరు వెళ్లాడు. అదే సమయంలో హర్షవర్ధన్ నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. గమనించిన అతని వెంట ఉన్న మరో స్నేహితుడు నదిలో దూకబోతున్న హర్షవర్ధన్‌ను నిలువరించేందుకు ప్రయత్నించాడు. ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకుంటున్న స్నేహితుడి నుంచి విడిపించుకున్న యువకుడు వారధి రైయిలింగ్ పైకి ఎక్కి నదిలో దూకేశాడు. వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించి రాత్రి సమయంలో టార్చ్ లైట్లతో వెదికినప్పటికీ యువకుడి ఆచూకీ లభించలేదు. సోమవారం తెల్లవారుజాము నుంచి గాజుల్లంకకు చెందిన మత్స్యకారులు నదిలో గాలించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. నదిలో నీటిమట్టం పెరగడంతోపాటు, యువకుడు దూకిన ప్రదేశంలో సుడి గుండాలు ఉండడంతో గాలింపు ప్రయత్నాలను విరమించుకున్నారు. యువకుడు ఆత్మహత్యాయత్నం సమాచారం అందుకున్న తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, కొల్లూరు పోలీసులు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం కోసం ఉన్నతాధికారులకు నివేదించినప్పటికీ ఉన్నతాధికారుల అనుమతులలో జాప్యం కారణంగా సోమవారం రాత్రి వరకు వారు అందుబాటులోకి రాలేదు. సంఘటనా ప్రాంతానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది లైఫ్ బోట్ సాయంతో యువకుడి ఆచూకీ కోసం వారధి పరిసర ప్రాంతాలలో గాలింపు చర్యలు జరిపినా ఎటువంటి ప్రయోజనం లభించలేదు. యువకుడు ఆత్మహత్యాయత్నంపై గ్రామంలో భిన్న కథనాలు వెలువడుతున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. దర్యాప్తులో ఆత్మహత్యాయత్నానికి పాల్పడటానికి కారణాలు వెలువడనున్నట్లు పోలీసులు వెల్లడించారు. యువకుడు గల్లంతుపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని కొల్లూరు పోలీసులు తెలిపారు.

తురకపాలెంలో వైద్య సహాయ కార్యక్రమాలు

- కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి
- నేడు ఆరోగ్య పరిస్థితులను సమీక్షించనున్న ఐసీఎంఆర్ బృందం

గుంటూరు రూరల్: తురకపాలెంలో సంక్రమణ వ్యాధుల నియంత్రణ చర్యలను మరింతగా బలోపేతం చేసేలా రాష్ట్ర, జిల్లాస్థాయి వైద్య ఆరోగ్య శాఖాధికారులు, ఎయిమ్స్, ప్రైవేట్ వైద్య నిపుణులతో విస్తృత స్థాయిలో కృషి చేస్తున్నామని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. ఆమె సోమవారం ఎయిమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం వైద్యులు సంక్రమణ నియంత్రణ చర్యలను పరిశీలించి, పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ ఆస్టర్ రమేష్ ఆసుపత్రి నుంచి వచ్చిన ఇన్ఫెక్షన్ స్పెషలిస్టులు, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు గ్రామంలో ఓపీ కేసులను పరీక్షించి రోగులకు చికిత్స అందించారని తెలిపారు. రక్త నమూనాల పరీక్షల్లో అసాధారణ ఫలితాలు వచ్చిన వారికి సంబంధిత విభాగం వైద్య నిపుణుల ఆధ్వర్యంలో చికిత్స అందించడంతో పాటు తదుపరి చికిత్స నిమిత్తం ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు పంపనున్నట్లు చెప్పారు. మంగళవారం ఢిల్లీ నుంచి ఐసీఎంఆర్ నిపుణుల బృందం గ్రామాన్ని సందర్శించి ఆరోగ్య పరిస్థితులను సమీక్షిస్తుందని చెప్పారు. ప్రస్తుతం గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు అనారోగ్య కారణాలు, ఇన్ఫెక్షన్ డీసీజ్‌తో ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. వీరిలో ఆగస్టు 21న చేరిన పి. ఎలీషా, 31న చేరిన పి. నరసింహారావుకు మెలియోయిడోసిస్ వ్యాధి నిర్ధారణ అయిందని కలెక్టర్ తెలిపారు. వీరి ఆరోగ్యం ప్రస్తుతం స్థిరంగా ఉందని చెప్పారు. గ్రామంలో 4,000 లీటర్ల సామర్థ్యం గల 20 ట్యాంకర్లు, 12,000 లీటర్ల సామర్థ్యం గల మూడు ట్యాంకర్లు ద్వారా మంచి నీటిని సరఫరా చేస్తున్నట్లు వివరించారు. గ్రామస్తుల తాగునీటి అవసరాల కోసం 680 వాటర్ క్యానులను పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

వేధింపులపై ఐసీసీలో ఫిర్యాదు చేయండి



యడ్లపాడు ఎస్ఎస్ఎల్ మిల్లులో అవగాహన కల్పిస్తున్న మహిళా సంరక్షణ విభాగాల అధికారులు

యడ్లపాడు: మహిళలపై జరిగే వేధింపుల నిర్మూలనకు ఐసీసీ(ఇంటర్నల్ కంప్లెట్స్ కమిటీ) ఏర్పాటు చేసినట్లు డీవీసీ(గృహహింస కేసుల) సోషల్ కౌన్సిలర్ ఎం.సంగీత తెలిపారు. మండలంలోని ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్ మిల్లులో సోమవారం మిషన్ సంకల్ప కార్యక్రమంలో భాగంగా బాలలు, మహిళలకు చట్టాలకు సంబంధించి అవగాహన సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ నాదెండ్ల ప్రాజెక్టు సీడీపీఓ జి.శాంతకుమారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పని ప్రదేశాలలో మహిళలపై జరిగే లైంగిక దాడుల నివారణ కోసం ఐసీసీ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే గృహహింస నిరోధక చట్టంపై మహిళలకు వివరించారు. ఓఎస్‌సీ(ఒన్ స్టాప్ సెంటర్) లీగల్ కౌన్సెలర్ కె.వాణిశ్రీ మాట్లాడుతూ మహిళా సంరక్షణ, ఉచిత న్యాయాన్ని అందించేందుకు 2006లో వచ్చి గృహహింస చట్టంపై ప్రతి మహిళా అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా కేంద్రంలో వన్‌స్టాప్ సెంటర్ ద్వారా గృహహింసకు సంబంధించిన కేసుల్లో నేరుగా పోలీస్‌స్టేషన్లకు వెళ్లకుండా ముందస్తుగా ఓఎస్‌సీలో మహిళలు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఐదురోజులు వైద్యం, భోజన, వసతి కల్పించి వారికి కుటుంబ సభ్యులను కలిసి బాధిత మహిళకు న్యాయం పొందే అవకాశం ఉందన్నారు. అక్కడ కూడా న్యాయం లభించకుంటే ఆ తర్వాత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కోర్టుద్వారా న్యాయం పొందవచ్చన్నారు. సీడీపీఓ జి.శాంతకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలు, గర్భిణులు - బాలింతలు, పిల్లల ఆరోగ్యం, పోషణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆర్.సామ్రాజ్యం, కె.వెంకటరమణ, మహిళా పోలీస్ నిర్మల, వలస కూలీలు, మహిళా కార్మికులు, అంగన్‌వాడీ తల్లులు పాల్గొన్నారు.

చెవిలో పూలు పెట్టుకుని వినూత్న నిరసన




నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘు నాయకులు


- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్

లక్ష్మీపురం: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కొత్తపేట భగత్ సింగ్ బొమ్మ వద్ద చెవిలో పూలు పెట్టుకుని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు సోమవారం వినూత్నంగా నిరసన తెలిపారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మాట్లాడుతూ పది మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో నడపడం వల్ల మెరిట్ విద్యార్థులు ఎంబీబీఎస్‌కు దూరమవుతారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 14 మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేశారని, వాటిలోరాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల, విజయనగరం జిల్లాల్లో గత విద్యా సంవత్సరంలో కళాశాలలు ప్రారంభమైనట్లు గుర్తు చేశారు. నేడు కూటమి ప్రభుత్వంలో కీలక నేతగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన సొంత మంగళగిరి నియోజకవర్గంలో యువగళం పాదయాత్రలో భాగంగా ప్రతి మెడికల్ కళాశాలను 100శాతం ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగిస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత పీపీపీ విధానాన్ని తీసుకువచ్చి ఈరోజు కళాశాలలను కార్పొరేట్లకు అప్పజెబుతున్నారని ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫణీంద్ర మాట్లాడుతూ ఈ విధానం వల్ల పేద మెరిట్ విద్యార్థులకు ఎంబీబీఎస్ విద్య కలగానే మిగిలిపోతుందని తెలిపారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీఓ 77 రద్దు చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో మోసాన్ని విద్యార్థుల్లోకి తీసుకువెళ్లి పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండు శివ, బందారపు యశ్వంత్, నగర కార్యదర్శి ప్రణీత్, నాయకులు అజయ్, దుర్గా ప్రసాద్, సాయి గణేష్, పవన్, వెంకీ పాల్గొన్నారు.

జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికలు



ఎంపికైన బాలికల టీంతో వ్యాయామ ఉపాధ్యాయులు



బాలుర టీంతో వ్యాయామ ఉపాధ్యాయులు

రొంపిచర్ల:స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ సెలక్షన్స్ సోమవారం జరిగాయి. ఈ సెలక్షన్స్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో గల వివిధ పాఠశాలల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 32మంది క్రీడాకారులను ఉమ్మడి గుంటూరు జిల్లా టీంకు ఎంపికచేశారు. వారిలో బాలుర నుంచి 16 మంది, బాలికల నుంచి 16మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెలలో వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీసీ కమిటీ చైర్మన్ ఏడుకొండలు తెలిపారు. క్రీడాకారులను విశ్రాంత హెచ్ఎం ఎన్.రామకృష్ణారెడ్డి, హెచ్ఎం బీఎం సుభాని అభినందించారు.